
ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

ఉమ్మడి కరీంనగర్ జిల్లా
జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి | ఆదివారం సెప్టెంబర్ 27,2026



# సీఎం సభను విజయవంతం చేయాలి --- తోట లహరి.



**వేములవాడ సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర )**
ఈ నెల 30వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి హాజరుకానున్న సందర్భంగా వేములవాడ పట్టణ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చేలా అవసరమైన కార్యాచరణపై సమావేశంలో చర్చించారు.
వేములవాడ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు,తోట లహరి.

# జగిత్యాల పర్యాటక వైభవం -- ప్రకృతిని కాపాడుతూ ప్రయాణిద్దాం

**చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యాల సమ్మేళనంగా జగిత్యాల జిల్లా**
**తెలంగాణ పర్యాటక వైభవంలో జగిత్యాల జిల్లా ప్రత్యేక స్థానం**
**ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం**



**జగిత్యాల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో):**
కొత్త ప్రాంతాలను చూడాలనే ఆసక్తి, అక్కడి ప్రజల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి చేసే ప్రయాణాలు మధురానుభూతులను మిగిల్చడం తో పాటు , రోజు వారి జీవన ప్రయాణంలో ఒత్తిడినితగ్గిస్తూ , మన పరిజ్ఞానాన్ని విస్తరింపజేస్తాయి. విభిన్న ప్రాంతాల సంస్కృతులను పరిచయం చేస్తాయి. ప్రకృతి అందాలను ఆస్వాదించే అవకాశం కల్పిస్తాయి. చరిత్రను తెలుసుకునే మార్గాన్ని చూపుతాయి. అయితే పర్యాటకం తో పాటు బాధ్యత కూడా ఉండాలి. మన ప్రయాణం వల్ల ప్రకృతికి, చారిత్రక కట్టడాలకు, స్థానిక ప్రజల జీవన విధానానికి ఎలాంటి నష్టం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పర్యాటకుడి పైనా ఉంది. పర్యావరణహిత, బాధ్యతాయుత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా భావితరాలకు మన సహజ, చారిత్రక, సాంస్కృతిక సంపదను అందించవచ్చు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ పర్యాటక వైభవాన్ని గుర్తుచేసుకోవడం సముచితం. తెలంగాణలో చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలకు కొదవలేదు. వాటిలో జగిత్యాల జిల్లాకు ప్రత్యేకమైన స్థానం ఉంది. చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యం, గోదావరి నదీ సంస్కృతి, గ్రామీణ జీవన విధానం కలగలిసిన ప్రాంతంగా జగిత్యాల జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. కొండలు, నదులు, దేవాలయాలు, కోటలు, పురాతన కట్టడాలు, పచ్చని పంట పొలాలు, గ్రామీణ వాతావరణం పర్యాటకులను ఆకట్టుకునే విశేష సంపదగా నిలుస్తున్నాయి. పేజి 2లో

# పౌర్ణమి సందర్భంగా శ్రీ యోగనంద లక్ష్మీ నరసింహా స్వామి ఏడవ గిరిప్రదక్షిణ

**జూలపల్లి సెప్టెంబర్ 26 ( విజన్ ఆంధ్ర):**
ఈరోజు పెద్దాపూర్ గ్రామంలో పౌర్ణమి సందర్భంగా ఏడవ గిరిప్రదక్షిణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురేష్ ఆత్మరామ్ మహారాజ్ స్వామి రావడం జరిగింది మాజీ ఎమ్మెల్యే గారు దాసరి మనోహర్ రెడ్డి గారు పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ తొగర్ శ్రీనివాస్ ఉప సర్పంచ్ జీకే యాదవ్ ఎండోమెంట్ ఈవో ప్రభాకర్ సర్పంచులు వెంకటేశ్వర్లు నాంపల్లి సంపత్ కుమార్ అంజమ్మ లక్ష్మణ్ పెంట కిషోర్ ఉప సర్పంచులు మహేష్ మనోహర్ మాజీ ఉపసర్పంచ్ బొజ్జ శ్రీనివాస్ పాఠకుల అనిల్ పసునూటి శ్రీనివాస్ మరియు వార్డ్ సభ్యులు స్వామి రాజ్ కుమార్ తోట వెంకన్న గడ్డమీది శ్రీనివాస్ ఉయ్యాల వెంకటేష్ లక్ష్మణ్ లక్ష్మీరాజం అరకోలు శ్రీనివాస్ అబ్బాపూర్ ఒమేగా హాస్పిటల్ కంకణాల శ్రీనివాస్ వెంకటేష్ మద్దెల నరేష్ ఆశాడపు రవీందర్ హనుమాన్ భక్త బృందం బుర్ర నర్సయ్య బూరుగు రమేష్ చిప్ప వెంకటేశం ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు శ్రీనివాసాచార్యులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు





# అప్రకటిత విద్యుత్ కోతలతో రైతుల గోస

**లో-వోల్టేజీతో మోటార్లకు నష్టం.. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలతో సాగునీటికి ఆటంకం**
**పంట కీలక దశల్లో విద్యుత్ సరఫరా అంతరాయంతో రైతుల్లో ఆందోళన**

**మెట్‌పల్లి డివిజన్, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కీలకంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో అప్రకటిత విద్యుత్ కోతలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వర్షాలు సమృద్ధిగా లేకపోయినా, కాలువ నీరు సమయానికి అందకపోయినా బోరుబావులపై ఆధారపడి రైతులు పంటలకు సాగునీరు అందిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే దాని ప్రభావం నేరుగా పంటలపై పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పంటలో ఒకేసారి ఎక్కువ మోతాదులో నీరు అవసరమయ్యే కీలక దశల్లో విద్యుత్ అందుబాటులో లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పంటకు సకాలంలో నీరు అందకపోతే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.



## లో-వోల్టేజీ సమస్య

విద్యుత్ సరఫరాలో లో-వోల్టేజీ సమస్య కూడా రైతులకు మరో ఇబ్బందిగా మారింది. తక్కువ వోల్టేజీ కారణంగా మోటార్లు వేడెక్కడం, స్టార్టర్లు దెబ్బతినడం, మోటార్లు కాలిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడటంతో అవి తరచూ కాలిపోతున్నాయని పేర్కొంటున్నారు.
ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్న తర్వాత మరమ్మతు లేదా మార్పిడి జరిగే వరకు పంట పొలాలకు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడుతోంది. పంటకు అత్యవసరమైన సమయంలో ఈ ఆలస్యం రైతులకు అదనపు నష్టాన్ని తెచ్చిపెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రైతుపై అదనపు ఆర్థిక భారం

ఇప్పటికే సాగు పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో విద్యుత్ సమస్యలు రైతుపై మరో ఆర్థిక భారంగా మారుతున్నాయి. మోటార్ల మరమ్మతులు, స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన ఖర్చులతో పాటు అదనపు కూలీ ఖర్చులు కూడా భరించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. సకాలంలో నీరు అందక పంట దిగుబడి తగ్గితే నష్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

## సరఫరాపై పారదర్శక సమాచారం ఇవ్వాలి

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా వేళలు, కోతల వివరాలు, లో-వోల్టేజీ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలపై పారదర్శకంగా సమాచారం అందుబాటులో ఉండాలని రైతులు కోరుతున్నారు. పంట కీలక దశల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న వెంటనే మరమ్మతులు లేదా ప్రత్యామ్నాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన సమయంలో పగటిపూట విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విజన్ ఆంధ్ర
ఆదివారం సెప్టెంబర్ 27,2026

# జగిత్యాల పర్యాటక వైభవం -- ప్రకృతిని కాపాడుతూ ప్రయాణిద్దాం

(మొదటి పేజీ తరువాయి..)

కొండగట్టు -- జగిత్యాల పర్యాటకానికి మణిహారం

మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పరిసరాల్లోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి క్షేత్రం జిల్లాలోనే కాకుండా తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా నిలుస్తోంది. కొండల మధ్య ప్రకృతి ఒడిలో వెలసిన ఈ క్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు.

కొండగట్టు ప్రత్యేకత కేవలం ఆలయానికే పరిమితం కాదు. ఆలయ పరిసరాల్లోని కొండలు, పచ్చని చెట్లు, వర్షాకాలంలో కనిపించే ప్రకృతి సోయగాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాలను ఆస్వాదించగలిగే ప్రాంతంగా కొండగట్టు ప్రత్యేక గుర్తింపు పొందింది.

పర్యాటకుల రాక పెరుగుతున్న నేపథ్యంలో కొండగట్టు పరిసరాల్లో పరిశుభ్రత, పచ్చదనం, ప్లాస్టిక్ నియంత్రణ, వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## ధర్మపురి -- గోదావరి తీరాన ఆధ్యాత్మిక వైభవం

గోదావరి నది తీరంలో వెలసిన ధర్మపురి జగిత్యాల జిల్లాలో మరో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఇక్కడి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.

ఆలయ దర్శనంతో పాటు గోదావరి నదీ తీరంలోని ప్రకృతి అందాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. నదీ తీర ప్రాంతం భక్తులకు, పర్యాటకులకు ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తుంది. ఆధ్యాత్మికత, నదీ సంస్కృతి, ప్రకృతి సౌందర్యం కలిసిన ప్రాంతంగా ధర్మపురి ప్రత్యేకతను సంతరించుకుంది.

గోదావరి నది జిల్లాలోని పలు ప్రాంతాలకు సహజసిద్ధమైన అందాన్ని అందిస్తోంది. నదితో ముడిపడిన స్థానిక సంస్కృతి, పండుగలు, సంప్రదాయాలు కూడా పర్యాటకులకు ఆసక్తిని కలిగిస్తాయి.

## జగిత్యాల కోట -- చరిత్రకు సజీవ సాక్ష్యం

జగిత్యాల పట్టణంలోని చారిత్రక కోట జిల్లాకు గర్వకారణమైన వారసత్వ కట్టడాల్లో ఒకటి. నక్షత్రాకార నిర్మాణ శైలి, కోట చుట్టూ ఉన్న చారిత్రక నేపథ్యం పర్యాటకులను ఆకర్షించే అంశాలు.

చారిత్రక కట్టడాలు కేవలం రాళ్లు, గోడలు మాత్రమే కావు. అవి గత తరాల జీవన విధానం, నిర్మాణ నైపుణ్యం, పాలనా చరిత్రకు సజీవ సాక్ష్యాలు. అందువల్ల జగిత్యాల కోట వంటి వారసత్వ కట్టడాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

కొండగట్టు, ధర్మపురి, జగిత్యాల కోటలను అనుసంధానిస్తూ సమగ్ర పర్యాటక మార్గాలను అభివృద్ధి చేస్తే జిల్లాలో పర్యాటక అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంది.

కోటిలింగాల -- శాతవాహన చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం

జగిత్యాల జిల్లా చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే అత్యంత ముఖ్యమైన ప్రాంతాల్లో కోటిలింగాల ఒకటి. గోదావరి, పెద్దవాగు సంగమ ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతానికి ప్రాచీన చరిత్రలో విశిష్ట స్థానం ఉంది.

ధర్మపురికి సుమారు 19 కిలోమీటర్లు, కరీంనగర్ కు సుమారు 55 కిలోమీటర్లు, హైదరాబాద్ కు సుమారు 218 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటిలింగాల ప్రస్తుతం గ్రామీణ వాతావరణంలో ఉన్నప్పటికీ, గతంలో అత్యంత



ప్రాధాన్యం కలిగిన చారిత్రక ప్రాంతంగా వెలుగొందింది. శాతవాహనుల కాలానికి సంబంధించిన నాణేలు, పురావస్తు అవశేషాలు ఈ ప్రాంత ప్రాచీనతను చాటుతున్నాయి. శాతవాహనుల తొలి రాజధానిగా కోటిలింగాల కు చారిత్రక ప్రాధాన్యం ఉంది. పురావస్తు తవ్వకాలలో లభించిన నాణేలు, మట్టి పాత్రలు, ఇతర అవశేషాలు అప్పటి నాగరికత, వాణిజ్య కార్యకలాపాలపై విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి.

గోదావరి తీరంలో ఉన్న కోటిలింగాల చారిత్రక ప్రాధాన్యం తో పాటు ప్రకృతి సౌందర్యానికి కూడా నిలయంగా ఉంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసరాలు, గోదావరి బ్యాక్‌వాటర్ ప్రాంతం పర్యాటక అభివృద్ధికి అవకాశాలను కల్పిస్తున్నాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటింగ్ వంటి సదుపాయాలు కూడా పర్యాటక ఆకర్షణను పెంచుతున్నాయి.

కోటిలింగాల ను చరిత్ర, పురావస్తు, ఆధ్యాత్మికత, ప్రకృతి పర్యాటకాల ను కలిపిన ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

## వాల్గొండ -- గోదావరి తీరాన త్రికూటాలయ వైభవం

జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలంలోని వాల్గొండ గోదావరి నదీ తీరాన ఉన్న మరో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశం. గోదావరి ఒడ్డున కొండ ప్రాంతం వైపు వాలుగా ఉన్న భౌగోళిక స్వరూపం కారణంగా ఈ ప్రాంతానికి వాల్గొండ అనే పేరు ఏర్పడినట్లు స్థానిక చరిత్రలో పేర్కొంటారు.గోదావరి తీరంలోని గుట్టపై ఉన్న త్రికూటాలయం ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ. చాళుక్యుల కళా రీతులను ప్రతిబింబించే నిర్మాణ శైలి ఈ ఆలయానికి చారిత్రక ప్రాధాన్యాన్ని కల్పిస్తోంది. రాయికల్ ప్రాంతంలోని త్రికూటాలయ నిర్మాణ శైలిని పోలిన శిల్పకళా లక్షణాలు ఇక్కడ కనిపిస్తాయి.

వాల్గొండ చుట్టూ పచ్చని పంట పొలాలు, గుట్టలు, గోదావరి నదీ ప్రవాహం, ప్రకృతి సిద్ధమైన అందాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి. పక్షుల సందడి, పంట పొలాల మధ్య గ్రామీణ వాతావరణం ఈ ప్రాంతానికి మరింత రమణీయతను అందిస్తున్నాయి.

ప్రకృతి అందాలతో పాటు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉన్న వాల్గొండ ను పర్యాటక పటంలో మరింతగా పరిచయం చేయాల్సిన అవసరం ఉంది.

రాయికల్, మెట్‌పల్లి ప్రాంతాలు -- గ్రామీణ



పర్యాటకానికి అవకాశాలు

జిల్లాలోని రాయికల్, మెట్‌పల్లి ప్రాంతాలు గ్రామీణ జీవన విధానం, వ్యవసాయ సంస్కృతి, స్థానిక ఆహార సంప్రదాయాలు, జానపద కళలను పరిచయం చేసే అవకాశాలను కలిగి ఉన్నాయి.

గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా స్థానిక ప్రజలకు అదనపు ఆదాయ మార్గాలు ఏర్పడవచ్చు. స్థానికంగా తయారయ్యే ఆహార పదార్థాలు, హస్తకళలు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ లభించవచ్చు. స్థానిక యువతకు టూరిస్ట్ గైడ్లు, హోమ్‌స్టేలు, రవాణా, ఆతిథ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు.

## గోదావరి -- జగిత్యాల పర్యాటకానికి సహజ వరం

గోదావరి నది జగిత్యాల జిల్లాకు ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం. గోదావరి తీర ప్రాంతాల్లోని పచ్చని పొలాలు, గుట్టలు, నదీ ప్రవాహం, గ్రామీణ వాతావరణం పర్యాటకులను ఆకట్టుకునే సహజ వనరులు.కోటిలింగాల, వాల్గొండ, ధర్మపురి తదితర గోదావరి పరివాహక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ పర్యావరణహిత పర్యాటక మార్గాలను అభివృద్ధి చేయవచ్చు. అయితే నదీ పర్యాటక అభివృద్ధి పేరుతో గోదావరి నదిని, నదీ పరిసరాలను కలుషితం చేయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రతే ప్రధాన బాధ్యత

పర్యాటక ప్రాంతాల అందాన్ని కాపాడటంలో పరిశుభ్రత కీలకం. కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల, వాల్గొండ తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలి.

ప్రతి పర్యాటకుడు చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోని చెత్త కుండీల్లోనే వేయాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించాలి. పునర్వినియోగ సీసాలు, సంచులను వినియోగించాలి. గోదావరి నదిలో చెత్త, ప్లాస్టిక్, పూజా సామగ్రిని పడవేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.స్థానికులకు ప్రయోజనం కలిగేలా పర్యాటక అభివృద్ధిపర్యాటకం అభివృద్ధి చెందితే దాని ప్రయోజనం స్థానిక ప్రజలకు చేరాలి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ లభించాలి. స్థానిక కళాకారులు, హస్తకళాకారులను ప్రోత్సహించాలి.

స్థానిక ఆహార పదార్థాలు, జానపద కళలు, గ్రామీణ జీవన విధానాన్ని పర్యాటకులకు పరిచయం చేయడం ద్వారా జగిత్యాల ప్రత్యేకతను మరింతగా చాటవచ్చు.

విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించాలి

పర్యాటక ప్రాంతాల పరిరక్షణపై విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలి. స్థానిక చరిత్ర, వారసత్వ కట్టడాలు, ప్రకృతి వనరుల ప్రాధాన్యాన్ని వారికి వివరించాలి.

కొండగట్టు , ధర్మపురి ఆలయాల చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టత, సాంస్కృతిక ప్రాధాన్యం మరియు జగిత్యాల కోట ప్రత్యేకత, కోటిలింగాల శాతవాహన చరిత్ర, వాల్గొండ త్రికూటాలయ విశిష్టతలను విద్యార్థులకు పరిచయం చేయాలి. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, మొక్కల సంరక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను



చేయాలి.

## అభివృద్ధి పేరుతో ప్రకృతికి నష్టం చేయొద్దు

పర్యాటక రంగం అభివృద్ధి చెందాల్సిందే. అయితే అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీయకూడదు. పర్యాటక ప్రాంతాలను అనవసరమైన కాంక్రీట్ నిర్మాణాలతో నింపకుండా, స్థానిక పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి.కొండలు, నదులు, చెట్లు, పక్షులు, వన్యప్రాణులు, చారిత్రక కట్టడాలు పర్యాటకానికి మూలసంపద. వాటిని సంరక్షిస్తూ అభివృద్ధి చేయడమే సుస్థిర పర్యాటకానికి నిజమైన అర్థం.

జగిత్యాల పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుదాం

కొండగట్టు ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిస్తే.. ధర్మపురి గోదావరి తీర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. జగిత్యాల కోట చారిత్రక వారసత్వానికి గుర్తుగా నిలుస్తోంది. కోటిలింగాల శాతవాహనుల ప్రాచీన చరిత్రను గుర్తుచేస్తోంది. వాల్గొండ చాళుక్యుల కాలపు త్రికూటాలయ నిర్మాణ కళకు, గోదావరి తీర ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

ఈ వైవిధ్యాన్ని సమర్థంగా ప్రచారం చేస్తూ, పర్యాటక ప్రాంతాలను పరస్పరం అనుసంధానం చేస్తే జగిత్యాల జిల్లాలో పర్యాటక రంగానికి మరింత విస్తృత అవకాశాలు ఏర్పడతాయి. అదే సమయంలో స్థానికులకు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరగడంతో జిల్లా ఆర్థికాభివృద్ధికి కూడా పర్యాటకం దోహదపడుతుంది.

బాధ్యతాయుత పర్యాటకమే భవిష్యత్ మార్గం

పర్యాటకం మన ఆనందం కోసం మాత్రమే కాదు. మన చరిత్రను తెలుసుకోవడానికి, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి, ప్రకృతిని ఆస్వాదించడానికి ఒక గొప్ప అవకాశం.కొండగట్టుకు వెళ్తే కొండల పరిశుభ్రతను కాపాడాలి.

ధర్మపురికి వెళ్తే గోదావరిని కలుషితం చేయకూడదు.

జగిత్యాల కోటను సందర్శిస్తే చారిత్రక కట్టడాన్ని గౌరవించాలి.

కోటిలింగాల కు వెళ్తే పురావస్తు అవశేషాలను సంరక్షించాలి.

వాల్గొండను సందర్శిస్తే ఆలయ వైభవంతో పాటు ప్రకృతి సౌందర్యాన్ని కాపాడాలి.

గ్రామీణ ప్రాంతాలను సందర్శిస్తే స్థానిక ప్రజల జీవన విధానాన్ని గౌరవించాలి.

ప్రకృతిని ఆస్వాదిద్దాం.. కానీ ప్రకృతిని నాశనం చేయకూడదు.

చరిత్రను తెలుసుకుందాం.. కానీ చారిత్రక కట్టడాలను దెబ్బతీయకూడదు.

స్థానిక సంస్కృతిని తెలుసుకుందాం.. కానీ స్థానికుల మనోభావాలను గౌరవించాలి.

జగిత్యాల పర్యాటక సంపదను ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంత ఉందో, దానిని భావితరాల కోసం సంరక్షించాల్సిన బాధ్యత కూడా అంతే ఉంది.

పర్యాటకం స్థానికులకు ఉపాధి ఇవ్వాలి.

పర్యాటకం ప్రకృతిని రక్షించాలి.

పర్యాటకం చరిత్రను కాపాడాలి.

# వెల్లుల్లలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

## తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర చిరస్మరణీయం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

**మెట్‌పల్లి డివిజన్, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా



నిలిచిపోయిందన్నారు. సామాజిక, ఆర్థిక వివక్షను ఎదుర్కొంటూ తన హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ఐలమ్మ చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె పోరాటం కేవలం ఒక వ్యక్తి హక్కుల కోసం జరిగిన పోరాటం కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం సాగిన ఉద్యమమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని ప్రతి



ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ఆమె పోరాట స్ఫూర్తిని యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వెల్లుల్ల గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఐలమ్మ సేవలు, పోరాట స్ఫూర్తిని పలువురు నాయకులు, రజక సంఘం ప్రతినిధులు స్మరించుకున్నారు.

# ఘనంగా వినాయక నిమజ్జనం వేడుకలు

**గంభీరావుపేట సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర)**



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గంభీరావుపేట మండలంలో శుక్రవారం వినాయక నిమజ్జనాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వినాయకులను చెరువులలో తొమ్మిది రోజులు పూజించి డప్పు చప్పులు, ఒగ్గు కళాకారులు నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. వినాయకులను చిన్న పెద్ద తేడా లేకుండా చెరువు వద్దకు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై సిహెచ్. శ్రీకాంత్ ఎప్పటికప్పుడు పరివేక్షించారు.

# మిడ్ మానేరు నిర్వాసితులకు న్యాయం చేయాలి

## 10,683 కుటుంబాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## సీఎం పర్యటనలో స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి: చల్మెడ లక్ష్మీనరసింహారావు

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర బ్యూరో):**
మిడ్ మానేరు ప్రాజెక్టు కోసం సర్వస్వం కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రానున్న నేపథ్యంలో ముంపు గ్రామాల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

మిడ్ మానేరు ప్రాజెక్టు పరిధిలో 10,683 నిర్వాసిత కుటుంబాలకు పునరావాస ప్యాకేజీలో భాగంగా ఇళ్ల స్థలాలు కేటాయించగా, 5,987 కుటుంబాలు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్నాయని, మరో 4,696 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం అవసరముందని చల్మెడ పేర్కొన్నారు. ఈ 4,696 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా అధికారిక సమాచారం వెల్లడిస్తోంది.

గతంలో ప్రకటించిన రూ.270 కోట్ల నిధుల విడుదల, వినియోగంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిధులు ఎంత విడుదలయ్యాయి, ఎంత ఖర్చయ్యాయి, ఇంకా ఎంత పెండింగ్‌లో ఉందో ప్రజలకు వెల్లడించాలని కోరారు. సంకేపల్లిలో పునరావాసం, పరిహారం,



మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా 45 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని అన్నారు. పాఠశాల, గ్రామపంచాయతీ, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముంపు గ్రామాల్లో యువత, మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సీఎం పర్యటన సందర్భంగా హామీలకే పరిమితం కాకుండా పరిహారం, పునరావాసం, ఇళ్లు, ఉపాధి సమస్యలకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని చల్మెడ డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నాణ్యతను పరిశీలించిన హౌసింగ్ ఏఈ హర్షిత

**మేడిపల్లి / భీమారం, సెప్టెంబర్ 26 ( విజన్ ఆంధ్ర ) :**



కల్వకోట గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను హౌసింగ్ ఏఈ హర్షిత, గ్రామపంచాయతీ కార్యదర్శి ఇళయ చంద్ర, సర్పంచ్ గుగ్గిల రమేష్ లు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ హర్షిత మాట్లాడుతూ, గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని, అక్టోబర్ 1 తేదీ నుంచి ప్రభుత్వం జారీచేసిన నూతన నిబంధనలు అమల్లోకి వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుగ్గిల రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# గణేష్ నిమజ్జనంలో ఉద్రిక్తత.. కొడిమ్యాలలో రెండు కేసులు నమోదు

**కొడిమ్యాల, సెప్టెంబర్ 26 ( విజన్ ఆంధ్ర )**
కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ నిమజ్జనం సందర్భంగా బస్‌స్టాండ్, అంబేద్కర్ చౌరస్తా ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించి రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు కొడిమ్యాల ఎస్ఐ ఏ. నరేష్ కుమార్ తెలిపారు. ఇరు ఘటనలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

## ఊరేగింపుపై రాళ్ల దాడి.. పలువురికి గాయాలు.

అంబేద్కర్ చౌరస్తా సమీపంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో గత వివాదాల నేపథ్యంలో గడ్డం లక్ష్మారెడ్డి, గడ్డం నరేందర్ రెడ్డి తదితరులు కలిసి ఊరేగింపును అడ్డుకుని, చత్రపతి శివాజీ యూత్‌కు చెందిన వినాయక విగ్రహ ఊరేగింపు వర్గంపై రాళ్లు రువ్వినట్లు ఏనుగు నరసింహారెడ్డి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో చత్రపతి శివాజీ యూత్‌కు చెందిన కొంతమందికి గాయాలైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. అదేవిధంగా హ్యుందాయ్ క్రెట కారుపై రాళ్లు రువ్వడంతో ముందు అద్దంతో పాటు ఇతర భాగాలు దెబ్బతిన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

# నిబంధనలకు విరుద్ధంగా డీజేల మోత: ఇద్దరిపై కేసు నమోదు, రెండు సౌండ్ సిస్టమ్స్ సీజ్

**మల్యాల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
మల్యాల గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అధిక శబ్దంతో డీజే సౌండ్ సిస్టమ్స్ నిర్వహించిన ఇద్దరు ఆపరేటర్లపై మల్యాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వారి నుంచి రెండు డీజే సౌండ్ బాక్సుల సెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి మల్యాల గ్రామంలో శ్రీ గణేష్ విగ్రహ నిమజ్జన కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా రహదారిపై డీజే సౌండ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసి, రాత్రి మొదలుకుని తెల్లవారుజాము వరకు చెవులు చిల్లులుపడేలా అధిక శబ్దంతో హోరెత్తించారు. దీనివల్ల స్థానిక ప్రజలకు, వృద్ధులకు, రోగులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి నిబంధనలు అతిక్రమించిన డీజే ఆపరేటర్లు పిల్లి శ్రీనివాస్, సామంతుల రాజులపై కేసు నమోదు చేశారు. వారు ఉపయోగిస్తున్న రెండు డీజే సౌండ్ సిస్టమ్స్‌ను సీజ్



చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్. సందీప్ మాట్లాడుతూ... ప్రజల శాంతిభద్రతలకు, ప్రశాంతతకు భంగం కలిగించేలా రాత్రి వేళల్లో అధిక శబ్దంతో డీజేలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. భవిష్యత్తులో ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**గంభీరావుపేట సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర)**

గంభీరావుపేట మండల కేంద్రంలోశనివారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లు గారి పద్మ నరస గౌడ్, తో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ బిజెపి మండల అధ్యక్షుడు కోడె రమేష్ కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగాపలువురునాయకులుమాట్లాడుతూ.. భూస్వామ్య, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు నేటి తరానికిస్ఫూర్తిదాయకమన్నారు. మహిళా శక్తికి, సామాజిక న్యాయ పోరాటానికి ఆమె ప్రతీకగా



నిలిచారన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చాకలి ఐలమ్మను స్మరించుకోవడంతో పాటు ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆమె సేవలు, త్యాగాలను ప్రభుత్వం గౌరవంగా స్మరిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాపగారి వెంకటస్వామి గౌడ్ , గోపయ్య గారి లక్ష్మీనారాయణ గౌడ్, మల్యాల రాజ్వీర్, శివంది శ్రీనివాస్, దిశెట్టి రాజశేఖర్, ఎర్రం అంజిరెడ్డి, మౌలాల రామచంద్రన్ గౌడ్, తోపాటు ప్రజాప్రతినిధులు,రజక సంఘం అధ్యక్షుడు బాలభూది, ఉపాధ్యక్షుడు డి.టి. నరసింహులు, కోశాధికారి కర్రోల రమేష్, సలహాదారు పెద్ద మైసన్నగారి అశోక్ పాల్గొన్నారు.సంఘ సభ్యులు నారాయణ, అశోక్, పెద్ద మైసన్నగారి ప్రవీణ్, చిన్న కర్రోల సామి, గూడెపు రవి తదితరులు హాజరయ్యారు.

# ముస్తాబాద్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

## ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం: రజక సంఘం అధ్యక్షుడు సుద్దాల దేవయ్య

**ముస్తాబాద్, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర)**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ముస్తాబాద్ మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా



రజక సంఘం అధ్యక్షుడు సుద్దాల దేవయ్య మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, తెగువను ప్రపంచానికి చాటిన గొప్ప వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు.ఆమె త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని, ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. రజక వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టి, వారి అభివృద్ధికి అండగా నిలవాలని కోరారు.కార్యక్రమంలో ముస్తాబాద్ సర్పంచ్, వివిధ గ్రామాల రజక సంఘాల అధ్యక్షులు, మండల రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, యువకులు, రజక సంఘం సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్ఐవీపై అవగాహన కల్పించిన కళాజాత బృందం

**మెట్ పల్లి సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెట్ పల్లి పట్టణ బస్టాండ్ ఆవరణలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. జగిత్యాల జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాజాత బృందం పాటలు, కళారూపాల ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించింది.ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్, టీబీ సూపర్‌వైజర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హెచ్ఐవీకి ప్రస్తుతం పూర్తిగా నివారణ చేసే మందు లేకపోయినా, ఏఆర్టీ మందులను వైద్యుల సూచనల మేరకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. చికిత్స తీసుకోవడం ద్వారా వైరస్ ఇతరులకు వ్యాపించే ప్రమాదాన్ని కూడా గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.హెచ్ఐవీ వ్యాప్తిని అరికట్టేందుకు ఉపయోగించిన సూదులు, సిరంజిలను ఇతరులు ఉపయోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గుర్తింపు లేని రక్త వనరుల నుంచి రక్తం తీసుకోకుండా సురక్షితమైన రక్తాన్ని మాత్రమే వినియోగించాలని సూచించారు. తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమణను నివారించేందుకు గర్భధారణ సమయంలో పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని తెలిపారు. అలాగే సురక్షితమైన లైంగిక సంబంధాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి అండగా నిలవాలని, సరైన సమయంలో పరీక్షలు చేయించుకుని అవసరమైతే



ఏఆర్టీ చికిత్స పొందాలని పేర్కొన్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి లో ఏఆర్టీ/లింక్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.హెచ్ఐవీకి సంబంధించిన అనుమానాలు, సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1097ను సంప్రదించవచ్చని చెప్పారు. అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కూడా హెచ్ఐవీపై అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చని వివరించారు.హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి దగ్గు వంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, సమాజంలో భాగస్వాములుగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్, టీబీ సూపర్‌వైజర్ ఆంజనేయులు, పద్మపాణి ఎన్జీవో లింక్ వర్కర్ రాణి, వైఆర్‌జీ కేర్ ఎన్జీవో సిబ్బంది రాజు, లక్ష్మణ్, నవ్య, గడ్డం రమేష్ కళాజాతర బృందం తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

## పోలీసుల సమర్ధ దర్యాప్తుకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు

## టౌన్ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్‌ను కలిసి అభినందనలు

**వేములవాడ, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**



వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నిందితుడు కోరేపు రాజ్‌కుమార్‌కు గౌరవ న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. కేసులో పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి, పకడ్బందీగా ఆధారాలను సమర్పించడంతో నిందితుడికి శిక్ష పడటంపై బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

తమ కుటుంబానికి న్యాయం జరిగేలా కేసు దర్యాప్తులో కృషి చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, పోలీసు అధికారులు, సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ బి. వీరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

# తెలంగాణ చౌరస్తా వద్ద సులభ్ కాంప్లెక్స్, బోరింగ్ నిర్మించాలి

**-ఆర్జీ-3 జీఎంకు 4వ వార్డు మెంబర్ తన్నీరు ప్రదీప్ వినతి**



**రామగిరి సెప్టెంబర్ 26(విజన్ ఆంధ్ర )**

సెంటనరీ కాలనీలోని తెలంగాణ చౌరస్తా వద్ద సులభ్ కాంప్లెక్స్‌తో పాటు బోరింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ పన్నూరు 4వ వార్డు మెంబర్ తన్నీరు ప్రదీప్ శనివారం ఆర్జీ-3 జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ కి వినతిపత్రం అందజేశారు. సెంటనరీ కాలనీలో ఇటీవల ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా తెలంగాణ చౌరస్తా వద్ద ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ను పూర్తిగా తొలగించారని తెలిపారు. దీంతో షాపింగ్ యజమానులు, ప్రజలు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా అక్కడ బస్‌స్టాండ్ ఉండటంతో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సులభ్ కాంప్లెక్స్‌ను తిరిగి నిర్మించాలని కోరారు. అదేవిధంగా రోడ్డు విస్తరణలో భాగంగా బోరింగ్‌లను కూడా తొలగించారని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిరిగి బోరింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీఎంను విజ్ఞప్తి చేశారు.

# పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం

## చారిత్రక కట్టడాల పరిరక్షణతోనే పర్యాటకాభివృద్ధి

## యువత, విద్యార్థులు పర్యాటక వారసత్వానికి వారధులుగా నిలవాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేములవాడ, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించి మరింత మంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ మండలం నాంపల్లి గుట్టపై జిల్లా యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు, బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వీటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాల, కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్లు, షీల్డులు అందజేసి



అభినందించారు. బుర్రకథ, పిట్టలదొర ప్రదర్శనలు, విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభను చాటుకోవాలని సూచించారు. పరిసరాలపై అవగాహన, కరెంట్ అఫైర్స్‌పై పట్టు కోసం ప్రతిరోజూ దినపత్రికలు చదవడంతో పాటు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, నాంపల్లి గుట్ట, ఫారెస్ట్ అర్బన్ పార్క్ తదితర పర్యాటక, చారిత్రక ప్రదేశాల ప్రత్యేకతలను యువత, విద్యార్థులు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చారిత్రక ప్రదేశాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణలో భాగంగా సుమారు రూ.250 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని, గుడిచెరువు బండ్ పార్కును



సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పర్యాటక రంగం ద్వారా స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. దేశాల ఆర్థికాభివృద్ధిలో పర్యాటక రంగం కీలక పాత్ర పోషిస్తోందని, చారిత్రక వారసత్వం, ప్రకృతి అందాలను పరిరక్షిస్తూ పర్యాటకులను ఆకర్షించే కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పర్యాటక ఖ్యాతిని మరింత విస్తరించేందుకు యువత భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల, డీటీసీపీఓ అన్సార్, తహసీల్దార్ జయంత్, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల ఐలమ్మ 131 వ జయంతి వేడుకలు...

## రాదండి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు....

**ఓదెల సెప్టెంబర్ 26,(విజన్ ఆంధ్ర)**



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామంలో శనివారం రాదండి హర్ష వర్ధన్ ఆధ్వర్యంలో "చిట్యాల ఐలమ్మ" (చాకలి ఐలమ్మ)"లి 131 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలిచిందని,తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి,భూమికోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన సామాజిక పోరాటంలో ఒక గొప్ప స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి రాజయ్య,కాశిరెడ్డి మహేందర్ రెడ్డి,జాగిరి అంజి గౌడ్,ఆరెల్లి మొండయ్య,రావుల రాజు,జాగిరి కిషోర్,రావుల స్వామి,తాళ్లపల్లి శ్రీను,రజక సంఘం నాయకులు,గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో మెట్‌పల్లి సీడీపీఓ

## 21 అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల్లో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.63 వేల లంచం డిమాండ్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ కరీంనగర్ యూనిట్

**మెట్‌పల్లి, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సీడీపీఓ దరోజు పద్మ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కుకున్నారు. మెట్‌పల్లి అర్బన్ సెక్టార్ పరిధిలోని 21 అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సందర్భంగా ప్రతికూల వ్యాఖ్యలు చేయకుండా, అనుకూలంగా వ్యవహరించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఏసీబీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. 21 అంగన్‌వాడీ



కేంద్రాలకు సంబంధించి మూడు నెలలకు ఒక్కో కేంద్రం నుంచి రూ.3,000 చొప్పున మొత్తం రూ.63,000 లంచంగా డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో కేంద్రం నుంచి నెలకు రూ.1,000 చొప్పున లంచం డిమాండ్ చేస్తున్నట్లు కూడా ఏసీబీకి ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ కరీంనగర్ యూనిట్ అధికారులు ట్రాప్ నిర్వహించారు. ఫిర్యాదుదారుడి నుంచి రూ.63,000 లంచం స్వీకరిస్తుండగా సీడీపీఓ దరోజు పద్మను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆమె స్వాధీనం నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అరెస్ట్.. కోర్టులో హాజరు

ట్రాప్ అనంతరం సీడీపీఓను అరెస్ట్ చేసి, కరీంనగర్‌లోని ఎస్పీఈ డ ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు జ్యుడిషియల్ రిమాండ్ కోసం హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ వెల్లడించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది.

### లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

# అప్పులు క్రమం తప్పకుండా చెల్లిస్తే సంఘాల బలోపేతం అవుతాయి....

## మల్లికార్జున మండల సమాఖ్య

**ఓదెల సెప్టెంబర్ 26,(విజన్ ఆంధ్ర)**





పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని మల్లికార్జున మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఎస్ ఆ పి ఫౌజియా,అనురాధ ల ఆధ్వర్యంలో ఎస్ హెచ్ జి,వివో,ఎమ్మెస్ గ్రేడింగ్ ల గురించి మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ హెచ్ జి, వివో, ఎమ్మెస్ లు "ఏ" గ్రేడ్ లో ఉండాలంటే పొదుపులు,సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంఘాలు తీసుకునే అన్ని రకాల అప్పులు క్రమం తప్పకుండా చెల్లింపులు చేయాలని, చెల్లింపులు చేస్తే సంఘములు బలంగా ఉంటాయన్నారు. ఈ శిక్షణకు ఎస్ఆర్పి, అన్ని గ్రామాల అధ్యక్షులు,సిసి,ఎమ్మెస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ మల్యాల ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసం.

**కొడిమ్యాల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర**
కొడిమ్యాల మండలంలోని నమిలికొండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలలో ఐసిడిఎస్ మల్యాల ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పూడూర్ సూపర్వైజర్ సుధారాణి కార్యక్రమానికి విచ్చేసిన తల్లులకి పోషకాహారం శిశు సంరక్షణ మరియు ప్రీస్కూల్ గురించి ఈసీస్



కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది తల్లులు ఇట్టి కార్యక్రమంలో సంతోషంగా సమాధానాలు తెలియజేయడం జరిగింది మరియు తల్లులకి పోషకాహార ప్రాముఖ్యతను గురించి పాటించవలసిన జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది తర్వాత కార్యక్రమానికి హాజరైన అందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది . ఇట్టి కార్యక్రమానికి ఆశ మంజుల అంగన్వాడీ టీచర్స్ కల్పనా , వసంత , అరుంధతి ,సుమలత మరియు తల్లులు పిల్లలు హాజరు కావడం జరిగింది.

# పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే సహించేదే లేదు

## కొందరు కాంగ్రెస్లో ఉండి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిరుపతి గౌడ్

**గంభీరావుపేట, సెప్టెంబర్ 26, (విజన్ ఆంధ్ర)**

పార్టీ కార్యకర్తలకు సర్ది చెప్పాల్సింది పోయి సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి గ్రూపు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్ ఆరోపించారు. మండల కాంగ్రెస్ లో చోటుచేసుకున్న పరిణామాలపై శనివారం గంభీరావుపేట మండల కేంద్రంలోని దత్త సాయి ఫంక్షన్ హాల్ లో మండల స్థాయి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ నియమించిన మండల కమిటీకి లోబడి ప్రతి ఒక్కరూ సహకరించి పనిచేయాల్సింది పోయి గ్రూపు రాజకీయాలకు పాల్పడి పార్టీ విలువలను దిగజారుస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా నిలబడిన అనుభవం కలిగిన నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి వెనుకుండి కొంతమంది పార్టీ నాయకులను వాడుకోవడం విచారకరమన్నారు. కలిసికట్టుగా



కార్యక్రమాలు నిర్వహించాల్సింది పోయి పార్టీని విడగొట్టి వర్గ పోరుకు పాల్పడుతుండడం పార్టీపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారని వివరించారు. తన అవసరాలకు పార్టీలు మార్చి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడిగా చెప్పుకుంటున్న పర్శ హనుమాన్లు పార్టీ కండువా ఎవరి సమక్షంలో కప్పుకున్నారో తెలుపాలని డిమాండ్ చేశారు. మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ పార్టీ అధిష్టానం నియమించిన కమిటీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని అన్నారు. కొంతమంది పార్టీ నాయకులు కార్యకర్తలకు ప్రలోభాలు పెట్టి పార్టీ నియమించిన కమిటీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకాలని కోరారు. నూతన కమిటీ నియమించిన మొదల నుండి మండల కాంగ్రెస్ లో చోటుచేసుకున్న పరిణామాలు ఎప్పటికప్పుడు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్, ఉపాధ్యక్షులు ఎర్ర కిషన్ గౌడ్, జోగు సురేష్, జనరల్ సెక్రెటరీ తాహీర్, జిల్లా కో కన్వీనర్ మల్యాల రాజ్వీర్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి గాండ్ల బాలలక్ష్మి, నాయకులు బంగ్లా రాజా గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి యేత్వర్ రేణుక, ఈసీ సభ్యులు మొగులాల రామచంద్ర గౌడ్, రాగుల అంజిరెడ్డి, గోపగారి లక్ష్మీనారాయణ గౌడ్, ఎర్ర నరసయ్య, బోయినగారి లింగం, రాజ్ కుమార్, నిశాంత్, ప్రకాష్ గౌడ్, వెంకటస్వామి, శివంది శీను, దేశెట్టి రాజశేఖర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్లో అరుదైన మైక్రోస్కోపిక్ న్యూరో సర్జరీ

## ప్రాణాపాయ స్థితిలో వచ్చిన మహిళకు విజయవంతంగా చికిత్స

**జగిత్యాల డివిజన్ ఇంచార్జి , సెప్టెంబర్ 26:(విజన్ ఆంధ్ర )**

మెదడులో రక్తస్రావంతో పాటు అన్యురిజం కారణంగా ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన 60 ఏళ్ల మహిళకు కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన మైక్రోస్కోపిక్ న్యూరో సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉండటమే కాకుండా తన పనులను తానే చేసుకుంటున్నట్లు వైద్యులు శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం బాదంపల్లికి చెందిన 60 ఏళ్ల కూరగాయల వ్యాపారి కౌసల్య రోజువారీ పనుల్లో భాగంగా ఉదయం లేచి పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం వెంటనే కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. స్పృహ కోల్పోయిన స్థితిలో మెడికవర్ ఆస్పత్రికి చేరుకున్న కౌసల్యకు వైద్యులు అత్యవసరంగా సీటీ స్కాన్ నిర్వహించగా




మెదడులో రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. తదుపరి పరీక్షల్లో మెదడులోని రక్తనాళంలో అన్యురిజం ఉన్నట్లు నిర్ధారించారు. రక్తనాళం గోడ బలహీనపడటంతో ఒక ప్రాంతంలో బెలూన్లా ఉబ్బిపోయే పరిస్థితినే అన్యురిజం అంటారని, అది చిట్లినప్పుడు మెదడులో రక్తస్రావం జరిగి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందని వైద్యులు వివరించారు. కౌసల్యకు అన్యురిజం రప్చర్ అయ్యే పరిస్థితిలో అత్యంత క్లిష్టంగా మారిందని, ఆలస్యం జరిగితే ప్రాణాలకు ముప్పుతో పాటు తీవ్రమైన న్యూరోలాజికల్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో ఎమర్జెన్సీగా శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కుటుంబ సభ్యులకు పరిస్థితి, శస్త్రచికిత్సలో ఉన్న హెవీ రిస్క్ గురించి వివరించి వారి సమ్మతితో అత్యంత క్లిష్టమైన మైక్రోస్కోపిక్ న్యూరో సర్జరీ నిర్వహించినట్లు వెల్లడించారు. అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్య బృందం, ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉండటంతో సకాలంలో చికిత్స అందించి రోగి ప్రాణాలను కాపాడగలిగామని వైద్యులు పేర్కొన్నారు. పేషెంట్ కౌసల్య కుమారుడు మహేష్ మాట్లాడుతూ.. తన తల్లి ఉదయం ఒక్కసారిగా కుప్పకూలిపోవడం, పరిస్థితి చూసిన కొందరు ఆమె బతకడం కష్టమని చెప్పడంతో భయాందోళనకు గురయ్యామని పేర్కొన్నారు. అయితే మెడికవర్ వైద్యులు అత్యవసరంగా స్పందించి క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి తన తల్లిని సాధారణ స్థితికి తీసుకువచ్చారని, ప్రస్తుతం ఆమె తన పనులు తాను చేసుకుంటుండటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్రెడ్డి, అనెస్థీషియా హెడ్ డాక్టర్ వినయ్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు గిరిప్రదక్షిణ: భక్తులకు పండ్ల పంపిణీ

**మల్యాల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి 45వ గిరిప్రదక్షిణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాలు, హనుమాన్ నామస్మరణల నడుమ అత్యంత వైభవంగా సాగుతోంది. ఈ పుణ్య పర్వదినాన్ని పురస్కరించుకుని, గిరిప్రదక్షిణలో పాల్గొంటున్న వేలాది మంది భక్తులకు యల్ల సుస్మిత--మనోజ్ రెడ్డి దంపతులు తమ ఆధ్యాత్మిక సేవా నిరతిని చాటుకుంటూ అరటిపండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కొండ చుట్టూ భక్తిశ్రద్ధలతో కాలినడకన ప్రదక్షిణ చేస్తూ అలసివచ్చిన భక్తులకు ఉపశమనం కలిగించేందుకు స్వయంగా పండ్లను అందజేసి సేవా భావాన్ని చాటారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి, యల్ల మధు రెడ్డిలతో పాటు స్థానిక నాయకులు రమేష్, సంజీవ్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొని భక్తులకు పండ్లను పంపిణీ చేశారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

## సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర బ్యూరో):**



ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్ సమీపంలోని మైదానంలో సీఎం పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో శాఖల వారీగా ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, భద్రతా చర్యలను పక్కా ప్రణాళికతో చేపట్టాలని ఆదేశించారు.జిల్లా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములై ప్రజలకు గుర్తుండేలా సేవలు అందించాలని మంత్రి సూచించారు.సీఎం పర్యటన విజయవంతానికి అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.సమావేశంలో మంత్రులు శ్రీధర్బాబు, అడ్లూరి లక్ష్మణ్కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే తదితరులు పాల్గొన్నారు.

# పోషణ మాసం కార్యక్రమం..

**కొడిమ్యాల, సెప్టెంబర్ 26 ( విజన్ ఆంధ్ర )**

కొడిమ్యాల మండలం గౌరాపూర్ గ్రామంలో పోషణ మాసం, అక్షర అభ్యాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండ శ్రీనివాస్ రెడ్డి, ఎడెల్లి చిరంజీవి, మల్లేశ్వరి, కార్యదర్శి పావని, మంజుల, ఆయ లక్ష్మి, అంగన్వాడీ పిల్లలు, గ్రామ ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు.చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని, ప్రతి కుటుంబం పిల్లల ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు.



విజన్ ఆంధ్ర
ఆదివారం సెప్టెంబర్ 27,2026

# క్రీడా మైదానంలో పూడూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల జోరు.. జిల్లా స్థాయికి పలువురు ఎంపిక.

**కొడిమ్యాల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర )**
మండల స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పూడూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. అద్భుతమైన క్రీడా ప్రతిభతో పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

విజేతల వివరాలు:
వాలీబాల్ జట్టు -- ద్వితీయ స్థానం.
400 మీటర్ల పరుగు -- పల్లవి ప్రథమ స్థానం.
లాంగ్‌జంప్ అశ్విని ప్రథమ స్థానం.



ట్రిపుల్‌జంప్ -- అశ్విని ప్రథమ స్థానం.
ట్రిపుల్‌జంప్ -- అనుహ్య ద్వితీయ స్థానం.
హైజంప్ -- రచన ప్రథమ స్థానం.
హైజంప్ -- అశ్విని ద్వితీయ స్థానం.
డిస్కస్ త్రో -- అలేఖ్య ద్వితీయ స్థానం.
600 మీటర్ల పరుగు -- హాసిని ద్వితీయ స్థానం
200 మీటర్ల పరుగు -- జె. రిష్వంత్ ద్వితీయ స్థానం.
400 మీటర్ల పరుగు -- కె. మహాశ్రీ తృతీయ స్థానం.
600 మీటర్ల పరుగు -- జి. శ్రీవిద్య తృతీయ స్థానం.

ముఖ్యంగా పాఠశాల వాలీబాల్ జట్టు మండల స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించి జిల్లా స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి ప్రతీక ఐలమ్మ!!

### ఐలమ్మ ఆశయాల సాధనకు ఐక్యంగా కదలాలి
### రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
భూస్వామ్య పెత్తనాన్ని ఎదిరించి, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం అలుపెరగని పోరాటం సాగించిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పూసాల మోహన్, జిల్లా నాయకులు కొండపర్తి సంజీవ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం గోదావరిఖని స్థానిక కోర్టు చౌరస్తాలో రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బండి లక్ష్మణ్, పైడి రాజయ్య, వడ్లూరు దేవయ్య, రాగుల



రవీందర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వీరు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాడు భూస్వాముల దౌర్జన్యాలకు ఎదురొడ్డి, పేదల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం సామాజిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆమె ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఐలమ్మ త్యాగాలు, పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చి విద్యార్థులకు పరిచయం చేయాలని అతిథులు విజ్ఞప్తి చేశారు. రజకులు, బీసీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలని, జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తగిన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధనకు ఐలమ్మ చూపిన బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూసల శ్రీనివాస్, జాలిగాపు ఐలయ్య, మామిడి పోశం, గూడెపు రామచందర్, రామడుగు కొమురయ్య, నేరెళ్ల రవీందర్, కాసర్ల సురేష్, సంపత్, ఉల్లంగుల లక్ష్మయ్య, నడిగోట్టు పోశం, ఎడవల్లి లింగయ్య, శనిగరం రాజేశం, మా ఊరపు మల్లేష్, కొల్లూరు గోపాల్, ఓరుగంటి లింగయ్య, పాలడుగుల కనకయ్య, నగునూరి శంకర్, ఎజ్జ రాజయ్య, మడికొండ ఓదమ్మ, దామనపల్లి రాజేశం, బొడ్డుపల్లి నారాయణ, రాపాల మల్లయ్య, జనగామ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. రజక సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, పట్టణ రజక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.

# దమ్మన్నపేట తెలంగాణ మోడల్ స్కూల్లో ఘనంగా మాకు పార్లమెంటు నిర్వహణ

**గంభీరావుపేట సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర)**
గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలోని పీఎం శ్రీ పాఠశాలలో కార్యక్రమంలో భాగంగా శనివారం మాక్ పార్లమెంట్ను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.
విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, పార్లమెంటరీ విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సంభాషణా నైపుణ్యాలు మరియు సమస్యలపై చర్చించి పరిష్కారాలను సూచించే సామర్థ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.
మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు



తదితర పాత్రలను సమర్థవంతంగా పోషించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఏ. శ్రీలత మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రాయోగిక అవగాహనను కల్పిస్తాయని అన్నారు. భవిష్యత్తులో బాధ్యతాయుతమైన,



చైతన్యవంతమైన పౌరులుగా ఎదగడానికి ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.
కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మాక్ పార్లమెంట్‌ను విజయవంతంగా నిర్వహించారు.

# కొండగట్టులో వైభవంగా ముగిసిన అంజన్న పవిత్రోత్సవాలు

**మల్యాల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా సాగిన వార్షిక పవిత్రోత్సవాలు శనివారం మహాపూర్ణాహుతితో వైభవంగా



ముగిశాయి.ఆలయ అర్చకులు, వేద పండితులు యాగశాలలో మూడు రోజుల పాటు విశేష హోమాలు, శాంతి పూజలు నిర్వహించారు. చివరి రోజైన శనివారం యాగశాలలో ప్రత్యేక క్రతువులు పూర్తి చేసిన అనంతరం, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు.అనంతరం మూలవిరాట్టుతో పాటు ఉత్సవమూర్తులకు పవిత్రమాలలు సమర్పించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, హాజరైన భక్తులకు పవిత్రలను ప్రదానం చేసి వేద పండితులు మహదాశీర్వచనం అందజేశారు.?ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అంజన రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు, అర్చక బృందం, ఆలయ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# సంకేపల్లి అంగన్వాడీ-2 కేంద్రంలో ఈసీసీఈ దినోత్సవం

**వేములవాడ, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలోని సంకేపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రం-2లో ఈసీసీఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల అంగన్వాడీ చిన్నారులను సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ప్రాథమిక విద్యపై ఆసక్తి కల్పించడంతో పాటు, పాఠశాల విద్యకు సిద్ధం చేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇందులో



భాగంగా చిన్నారులకు సమీప పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు. పిల్లల భవిష్యత్తుకు పాఠశాల విద్య ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డివేణి పరుశురాం, ఉపసర్పంచ్ పండగ శంకర్, వార్డు సభ్యురాలు నాంపల్లి నాగరాజు, సూపర్‌వైజర్ శశి కిరణ్మయి, ఏఎన్ఎం సంధ్య మేరీ, ఆశా కార్యకర్తలు ఎం. రేణుక, ఎస్. శైలజ, అంగన్వాడీ ఉపాధ్యాయులు సీహెచ్. దేవలక్ష్మి, జె. మణెమ్మ, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి: తడగొండ.

**బోయినిపల్లి సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
తెలంగాణ సాయుధ పోరాట వీరనారి, మహిళా ధైర్యానికి ప్రతీక, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని తడగొండ గ్రామపంచాయతీలో ఆమె ఫోటోకు పూలమాలలు వేసి ఆమెకు ఘనంగా నివాళులు



అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, పోరాట పటిమ, ఆత్మగౌరవం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ చేపూరి వెంకటేష్, వార్డు సభ్యులు, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు హైమద్ హుస్సేన్, నాయకులు చేపూరి కనకయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంలో ఉద్రిక్తత.. కొడిమ్యాలలో రెండు కేసులు నమోదు

**కొడిమ్యాల, సెప్టెంబర్ 26 ( విజన్ ఆంధ్ర )**
కొడిమ్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ నిమజ్జనం సందర్భంగా బస్‌స్టాండ్, అంబేద్కర్ చౌరస్తా ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించి రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు కొడిమ్యాల ఎస్ఐ ఏ. నరేష్ కుమార్ తెలిపారు. ఇరు ఘటనలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

## ఊరేగింపుపై రాళ్ల దాడి.. పలువురికి గాయాలు.

అంబేద్కర్ చౌరస్తా సమీపంలో గణేష్ నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో గత వివాదాల నేపథ్యంలో గడ్డం లక్ష్మారెడ్డి, గడ్డం నరేందర్ రెడ్డి తదితరులు కలిసి ఊరేగింపును అడ్డుకుని, చత్రపతి శివాజీ యూత్‌కు చెందిన వినాయక విగ్రహ ఊరేగింపు వర్గంపై రాళ్లు రువ్వినట్లు ఏనుగు నరసింహారెడ్డి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో చత్రపతి శివాజీ యూత్‌కు చెందిన కొంతమందికి గాయాలైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. అదేవిధంగా హ్యుందాయ్ క్రెట కారుపై రాళ్లు రువ్వడంతో ముందు అద్దంతో పాటు ఇతర భాగాలు దెబ్బతిన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇంటి ముందు అధిక శబ్దంపై ప్రశ్నించడంతో వివాదం.. వాహనాల ధ్వంసం

అదే రోజు రాత్రి జరిగిన గణేష్ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా మరో ఘటనపై గడ్డం సౌజన్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంటి ముందు ఏనుగు నరసింహారెడ్డి, నాయిని రాజు, గడ్డం వంశీ తదితరులు సౌండ్ బాక్సుల ద్వారా అధిక శబ్దంతో మ్యూజిక్ పెట్టడంతో, ఇంటిలో చిన్న పిల్లలు ఉన్నందున శబ్దం తగ్గించాలని తాను కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో తనను, తన కుటుంబ సభ్యులను నిందితులు దుర్భాషలాడడంతో పాటు ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న కారును, మోటార్ సైకిల్‌ను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ ఏ. నరేష్ కుమార్ తెలిపారు.

# గిరిప్రదక్షిణ మార్గంలో మద్యం సీసాల కలకలం: భక్తుల ఆందోళన

**మల్యాల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**



కొండగట్టు గిరిప్రదక్షిణ మార్గంలో కొందరు ఆకతాయిలు మద్యం సీసాలు పగలగొట్టి వేస్తుండటంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. స్థానిక వివరాల ప్రకారం... గిరిప్రదక్షిణ సందర్భంగా సమీపంలోని సిసి రోడ్డు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బీరు సీసాలు పగలగొట్టి రోడ్డుపైనే వదిలేస్తున్నారు. గిరిప్రదక్షిణ చేసే భక్తులు చాలామంది పాదరక్షలు లేకుండా నడుస్తుంటారని, ఇలాంటి పరిస్థితుల్లో రోడ్డుపై గాజు పెంకులు పడి ఉండటంతో పాదాలకు గుచ్చుకుని గాయాలయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రదక్షిణలు మొదలయ్యే ముందే సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది మార్గాన్ని ముందుగానే పరిశీలించి, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. పవిత్రమైన గిరిప్రదక్షిణ మార్గంలో మద్యం సేవించి సీసాలు పగలగొట్టే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని, మార్గంలో పడి ఉన్న గాజు పెంకులు, చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఫోటోగ్రాఫర్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి!!

### నైపుణ్యాభివృద్ధికి ట్రేడ్ ఎక్స్‌పో దోహదం
### వృత్తిపరమైన అభివృద్ధికి ఎక్స్‌పోలు కీలకం
### రామగుండం మేయర్ మహంకాళి స్వామి

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**
ఫోటోగ్రఫీ రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ట్రేడ్ ఎక్స్‌పోలు చక్కని వేదికలుగా నిలుస్తున్నాయని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. అక్టోబర్ 2, 3, 4 తేదీల్లో హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో



నిర్వహించనున్న ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాలు నిత్యం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పుంతలు తొక్కుతున్నాయని, ఈ మార్పులకు అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక కెమెరాలు, అధునాతన పరికరాలు, సరికొత్త సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవడానికి ఇలాంటి ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఫోటోగ్రాఫర్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వృత్తిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఫోటోగ్రాఫర్లకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడంలో ట్రేడ్ ఎక్స్‌పోల పాత్ర కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4వ తేదీ ఆదివారం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎక్స్‌పోకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శనిగరపు మల్లేష్, దుస్స మహేష్, రామగిరి శ్రీనివాస్, తులసి, భాస్కర్, చిప్ప కుమారస్వామి, రఘు, గంగాధర్, రాకేష్, కోడి రామకృష్ణ, దాసరి కిషోర్, రమేష్, సాగర్ పాల్గొన్నారు.

## మల్యాల మండలం నూకపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా నలుగుతున్న జంబి గద్దె స్థల వివాద పరిష్కారానికి అధికారులు శనివారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు.



ఈ సందర్భంగా జంబి గద్దె సమస్యపై గ్రామస్థులు, ప్రజాప్రతినిధుల నుంచి అధికారులు పూర్తి వివరాలు, అభిప్రాయాలు సేకరించారు. గ్రామంలో కొనసాగుతున్న జంబి గద్దె వివాదంపై సర్పంచ్ చెవులమద్ది శ్రీనివాస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంని కలిసి పరిస్థితిని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడగా, కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు కేవలం మూడు రోజుల్లోనే గ్రామానికి చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.
?ఈ గ్రామసభకు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో ఆమని, గిర్దావరి తిరుపతి హాజరై ప్రజల వాదనలను, వినతులను పరిశీలించారు.
?జంబి గద్దె సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కార దిశగా అధికారులను పంపించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకి, కలెక్టర్కి, తరలివచ్చిన అధికారులకు సర్పంచ్ చెవులమద్ది శ్రీనివాస్ గ్రామ ప్రజలు, పాలకవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెవులమద్ది శ్రీనివాస్, మాజీ సర్పంచులు, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. తో ఓట్లను తొలగించే కుట్ర పన్నుతున్నారు సీఈసీ జ్ఞానేష్ కుమార్ గుప్తా రాజీనామా చేయాలి - కాంగ్రెస్ నేత బత్తుల నరేశ్ డిమాండ్

**మెట్ పల్లి, సెప్టెంబర్ 26( విజన్ ఆంధ్ర):**
దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ఎస్.ఐ.ఆర్. (ా.×.=) ద్వారా ఓట్లను తొలగించి మాయం చేసే కుట్రకు బీజేపీ ప్రభుత్వం తెరలేపిందని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మెట్ పల్లి 3వ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు 13 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని, ఒక్క తెలంగాణలోనే 94,94,000 మందికి నోటీసులు జారీ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ, అమిత్ షాలు తమకు కావలసిన ఓట్లను మాత్రమే ఉంచుకుని, మిగతా ఓట్లన్నీ తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లోనూ ఇదే జరిగిందని, కోర్టులు ఆదేశించినప్పటికీ ఎన్నికల సంఘం స్పందించకుండా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే నడుస్తోందని మండిపడ్డారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం




ప్రకారం ఆర్టికల్ 324 కింద ఎన్నికల సంఘం స్వతంత్రంగా, స్వేచ్ఛగా పనిచేయాలని, కానీ ప్రస్తుత ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ గుప్తా, మాత్రం బీజేపీకి అనుకూలంగా, అధికార పార్టీ స్వార్థం కోసం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడుస్తూ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గుప్తా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన సంస్కరణల ( 61 వ రాజ్యాంగ సవరణ ) ద్వారా దేశంలో యువతకు ఓటు హక్కు కావలసిన వయసును 21 సంవత్సరాలనుండి 18 సంవత్సరాలకు తగ్గించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేశారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి ప్రజలందరూ నిద్రమత్తు వీడి, ఓటు హక్కును కాపాడుకోవాలని, రాబోయే భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీని ప్రధానిగా గెలిపించే దిశగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నరేశ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మెట్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కో ఆప్షన్ సభ్యుడు మాధవరెడ్డి, నాయకులు బొల్లం రఘు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయం ముందు కళాకారుల మౌన దీక్ష

**అధికారులు స్పందించకపోతే ధూంధాం కార్యక్రమం నిర్వహిస్తాం. సంబంధిత కార్యాలయాలను ముట్టడిస్తాం.**

**రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తాం.**





**మెట్ పల్లి సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**

శనివారం ఉదయం పట్టణంలోని చావిడి చౌరస్తాలో అంబేడ్కర్ మహాశయుని విగ్రహానికి పూలవేసి నివాళులర్పించిన కళాకారులు అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు వారు ఏర్పాటు చేసుకున్న దీక్ష శిబిరానికి చేరుకున్న సుమారు 100 మంది కళాకారులు లలిత కళా సమితి సంస్థ స్థలకబ్జాకు జరుగుతున్న ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవడంలో మున్సిపల్ అధికారులు మరియు సంబంధిత అధికారులు నిర్లక్ష్యం, మౌనం వహిస్తున్నారని సమస్య ప్రారంభమై నేటికి నెల రోజులు గడిచిన సంబంధిత అధికారులు స్పందించకుండా మౌనం వహించడం కళా సమాజానికే అవమానకరమని తెలియజేస్తూ ప్రకార్డులు చేతబట్టి, నోటికి బ్లాక్ రిబ్బన్ ధరించి మౌన దీక్ష నిర్వహించారు. మౌన దీక్ష ముగిసిన అనంతరం వక్తలు మాట్లాడుతూ సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణదారులపై తగిన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని హితవుపలికారు. లేనియెడల పట్టణంలోని పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తాలో భారీ ధూంధాం కార్యక్రమం నిర్వహిస్తామని, అలాగే రిలే నిరాహార దీక్షలు కూడా చేపడతామని కళాకారులు తెలిపారు. ఈ సందర్భంగా లలిత కళా సమితి అధ్యక్షులు గోధూరు మురళి మాట్లాడుతూ అధికారులు స్పందించకుండా మౌనం వహిస్తే తాను ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. భారతీయ యువ మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు దయ్య రఘువీర్ మాట్లాడుతూ సంస్థకు సంఘీభావం ప్రకటించి సంస్థ స్థలాన్ని ఇంచు కూడా పోనిచ్చేది లేదని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భామ్సేప్ ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. చిరుతల నాటకరంగ కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తాళ్ళపల్లి సంపత్ గౌడ్ మాట్లాడుతూ సంస్థ స్థలాన్ని కాపాడుకోవటానికి మేము కూడా సంస్థకు అండగా నిలబడి ప్రతి కార్యక్రమంలో భాగంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెటుపల్లి డివిజన్ సాధన సమితి అధ్యక్షులు తోకల సత్యనారాయణ, నాంపల్లి గట్టయ్య, దేశీరాజు దేవలింగం, జగిత్యాల జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక కన్వీనర్ కోటగిరి వెంకటస్వామి, నాయకులు ఇల్లెందుల కృష్ణమాచారి, లలిత కళా సమితి అధ్యక్షులు గోధూరు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టెల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కోటగిరి చైతన్య, జాయింట్ సెక్రటరీ మగ్రి భాస్కర్, కార్యవర్గ సభ్యులు వర్మ, శేఖర్ మాస్టర్, అనిల్ మాస్టర్, బండి రవి, శేఖర్, దశరథం, కళా శక్తి గోధూరు కళాకారులు సోమ భూమన్న, మెట్టు భూమన్న, నర్సయ్య, రొయ్య నర్సయ్య, ఎర్ర గంగారం, బండి ముత్యాలు, కంచు ఎర్రన్న, బర్మా రమేష్, అనంతం, జగ్గసాగర్ శ్రీనివాస నాట్యమండలి అధ్యక్షులు రఘుపతి, సభ్యులు శ్రీధర్, రాజు, రాజారావు బ్రహ్మయ్య, శ్రీనివాస, భాస్కర్, ముత్యంపేట కళాకారులు విజయులు, నర్సయ్య, విష్ణు, శ్రీధర్, రేగుంట నాట్యమండలి కళాకారులు కళారి రాజన్న, లింగం, సంకు అశోక్, రాజేందర్, కవులు, కళాకారులు కళాభిమానులు తదితరులు పాల్గొని మెటుపల్లి కళా వైభవ వారసత్వ సంపద అయిన లలిత కళాసమితి యొక్క స్థలం మీద ల్యాండ్ గ్రాబింగ్ బకాసురుల ఆక్రమణదారులు, దుర్మార్గులు, దుష్ట రాక్షస రాజకీయ దాడులు, దాష్టీకాలకు వ్యతిరేఖంగా శాంతియుతంగా మున్సిపల్ మొదలగు సంబంధిత అధికారులకు మీరిచ్చిన రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాలు, బాధ్యతలను ఏ దృష్ట, దుర్బుద్ధి నాయకుల ఒత్తిడులకు తాకట్టు పెట్టకుండా తమ అధికారాలను సక్రమంగా వినియోగించి అక్రమ ఆక్రమణ చర్యలను తొలగించి కళా సంస్థను, సంస్థ స్థలాన్ని కాపాడు న్యాయం చేసి మెటుపల్లి పాత తాలూకా ప్రాంత కళా వైభవ గౌరవాన్ని, మెటుపల్లి ఇజ్జత్ ను కాపాడి మెటుపల్లి ప్రముఖుల మరియు మెటుపల్లి పాత తాలూకా ప్రాంత విజ్ఞుల, మేధావుల, పెద్దల, కళాభిమానులు, కళాపోషకుల ఆకాంక్షలను గౌరవించి అధికారులు నిర్లక్ష్యం, మౌనం వదిలిపెట్టి సంస్థకు న్యాయం చేయాలని కోరారు.

## జిల్లా స్థాయి ఖో ఖో పోటీల్లో నూకపల్లి మోడల్ కాలేజీ విద్యార్థినుల ప్రతిభ: రన్నరప్‌గా నిలిచి ట్రోఫీ కైవసం

**మల్యాల, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర)**




స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఖో ఖో బాలికల విభాగం క్రీడా పోటీలలో నూకపల్లి మోడల్ జూనియర్ కాలేజ్ విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు.పోటీలలో అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రన్నరప్‌గా నిలిచిన క్రీడాకారిణులకు ఖో+ఖో సెక్రటరీ బన్సీలాల్ చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా బన్సీలాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు.జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి కళాశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థినులను నూకపల్లి మోడల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ గుమ్మడి ఆదిత్య, ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) మల్యాల రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు క్రీడలపై ఉన్న ఆసక్తిని ప్రోత్సహిస్తూ వారిని తీర్చిదిద్దిన పీడీ రమేష్ కృషిని ప్రిన్సిపాల్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# బీసీల అభ్యున్నతికి కార్యాచరణ!!

**సంక్షేమ పథకాలపై రాజ్ ఠాకూర్ సమీక్ష**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 26 (విజన్ ఆంధ్ర):**

హైదరాబాద్ అసెంబ్లీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన తెలంగాణ శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొని రాష్ట్రంలో అమలవుతున్న బీసీ సంక్షేమ పథకాలపై సమీక్షించారు. బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పురోగతిపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. బీసీలకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చేందుకు అవసరమైన చర్యలపై చర్చించడంతో పాటు, సంక్షేమ కార్యక్రమాల అమలులో సంబంధిత శాఖల అధికారుల పాత్రపైనా సమీక్షించారు. బీసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలు నెరవేరేలా పర్యవేక్షణ, సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఈ సమావేశం ప్రాధాన్యంగా చర్చించింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, రామారావు పవార్, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ ఎల్. రమణతో పాటు బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## - పెద్దపల్లి జిల్లా స్థాయి లో 'వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక' (VGPP) శిక్షణా కార్యక్రమం



రామగిరి సెప్టెంబర్ 26(విజన్ ఆంధ్ర )రామగిరి మండలం, పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జె ఎన్ టీ యూ కళాశాలలో జిల్లా స్థాయి "వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (VGPP) శిక్షణ" మరియు ప్రణాళికా ప్రక్రియ సమావేశం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. దీనికి అనుబంధంగా, సమష్టి కృషితో కంటికి కనిపించే మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో "స్వచ్ఛతా హి సేవా -- 2026 (Collective Action for Visible Impact)µµ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు.ఈ కార్యక్రమంలో పన్నూర్ సర్పంచ్ చిందం మహేష్, పెద్దపల్లి జిల్లా స్థాయి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులు మరియు జిల్లా లో అన్ని మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.